# బైబిలు ఉపదేశంలో "సమాచారపు అందింపు" అనేది కీలకపు పదమైయుంది

బైబిలు సందేశాన్ని ఉపన్యసించడం లేక ఉపదేశించడం దేవుని యొక్క సందేశాన్ని మాటలద్వారా అందించే విధానమైయుంది. "ఉపన్యసించేవాడు పనిచేసే పనిముట్లు మాటలే" యని Batsell Barrett Baxter అన్నాడు.[1] నాగలి వ్యవసాయకుని పనిముట్టు అయ్యున్నట్టు, మాటలే ఉపన్యాసకుని పనిముట్లైయుంటాయ్. ఉపన్యాసకుని లేదా ఉపదేశకుని బైబిలు విత్తనములు విత్తువానితో పోల్చుతోంది (లూకా 8:5-8). "విత్తనము దేవుని రాజ్యము" అని ప్రభువైన యేసు అన్నారు (లూకా 8:11). విత్తనమును అంగీకరించు వారు వాక్యమును వినువారైయుంటారు (లూకా 8:12-15). ఫలభరితంగా ఉండాలంటే, ఉపన్యాసకులు లేక ఉపదేశకులు నోటి మాటలద్వారా దైవసందేశాన్ని అందించేటప్పుడు, దాని ఉద్దేశాన్ని, పరిమితులను, మరియు దాని శక్తిని గ్రహించినవారైయుండాలి.


## దేవుని వాక్యాన్ని అందించడంలోని ఉద్దేశం

సూక్ష్మంగా చెప్పాలంటే, దైవీక వర్తమానపు అందింపులో ఉన్న ఉద్దేశమంతా, దేవునితో జనులను ఐక్యపరచడమే. జనులను తనతో ఐక్యపరచుకొనడానికిగాను, ఏదోయొక విధంగా దేవుడు కొంతమంది మనుష్యులకు తన్ను గూర్చిన సమాచారాన్ని అందించుకున్నాడు. నరునికి తన్ను బయలు పరచుకొనడంలో దేవుడు ప్రాథమికంగా నోటి వాక్కులను సాధనంగా ఉపయోగించుకున్నాడు. అప్పుడు, తన్ను ఎవరికి బయలుపరచుకొన్నాడో, వారిని యితరులకు తనను బయలుపరచుకొనే సాధనాలుగా ఉపయోగించుకున్నాడు (2 తిమోతి 2:2). బైబిలునందు ఈ మనుష్యులు తరచుగా ప్రవక్తలని, సువార్తికులని, లేక ఉపదేశకులని సూచింపబడ్డారు (ఎఫెసీ. 4:11; 1 తిమోతి 2:7).

నరునికి తన్ను బయలుపరచుకొనడంలో దేవుడే మొదటి అంజ వేశాడు. తొలి సమాచారపు అందింపు బైబిలుద్వారా సువార్తికునికి, విత్తగలవానికి లేక వర్తమానికునికి

ప్రవహిస్తుంది. ఈ అంచలో (లేక) దశలో సువార్తికుడు కూడా శ్రోతయే అయ్యుంటాడు. విత్తగలవాడు లేక వర్తమానికుడు దేవుని యొద్దనుండి సందేశాన్ని పొందగా, దేవుని యొక్క స్వభావాన్ని అతడు తీసికోనారంభిస్తాడు. సువార్తికుని యొద్దనుండి ప్రార్థన ద్వారా సమాచారపు అందింపు తిరిగి దేవుని యొద్దకు వెళ్లుతోంది. అతడెంత ఎక్కువగా దైవ స్వభావాన్ని ధరిస్తూ ఉంటాడో, అంత ఎక్కువగా అతడు దేవునితో ఐక్యం చేయబడుతూ ఉంటాడు. దేవునితో ఏకమై, శ్రోతలకు (లేక వినువారికి) దేవుని యొక్క మనస్సును అందజేసే పనిని సువార్తికుడు అంగీకరిస్తాడు.

ఈ దిగువ చూపబడిన పటములో సమాచారపు అందింపు దేవుని యొద్దనుండి మనుష్యులకు, మరియు మనుష్యుల యొద్దనుండి దేవునికి ఎలా నడుస్తుందో చిత్రింపబడింది.




మానసికమైన ఉద్వేగపూరితమైన దేవుని స్వరూపాన్ని వాక్యమనే వాహనంలోనికి సువార్తికుడు మార్చి, ఆ స్వరూపాలను శ్రోతయొక్క మనస్సులోనికి రవాణా చేస్తాడు. దేవుని మనస్సు మరియు హృదయమనే ఆ రూప దృశ్యాలను అలా రవాణా చేయడంలోగల ఉద్దేశం శ్రోతయొక్క దృష్టిని సువార్తికుని వైపుకు ఆకర్షించుకొనుటకు కాదు, గాని శ్రోతను దేవునివైపుమరల్చి, తన్ను దేవునితో ఐక్యపరచడానికే. శ్రోత దేవునితో ఐక్యపరచబడినప్పుడు, ఆ వర్తమానం ఎవనిచే అందించబడిందో, వానితో అతడు ఐక్య పరచబడినవాడై యుంటాడు. సమాచారపు అందింపు యిరువైపుల జరుగుతుంది: దేవునినుండి సువార్తికునికి, సువార్తికుని నుండి దేవునికి; దేవునినుండి శ్రోతకు, శ్రోతనుండి దేవునికి. ఈ సమాచారపు అందింపు అనేది ప్రాథమికంగా మాటలు ఉపయోగించడంవలన జరుగుతోంది. మాటలను ఫలభరితంగా ఉపయోగించడానికిగాను, నోటి వాక్కుల మూలంగా సమాచారాన్ని అందించడంలో ఉన్న కొన్ని హద్దులను గ్రహించవలసి యుంటుంది.

## నోటి వాక్కుల మూలంగా సమాచారాన్ని అందించే కొన్ని హద్దులు

నోటి వాక్కులతో సమాచారాన్ని అందించడంలోని అతి సాధారణమైన పరిమితి ఏమంటే మాటల యొక్క సాధారణమైన గ్రహింపు లేకపోవడమే. మాట్లాడే ఒక మాట సువార్తికుని

మనస్సులో ఉన్న ఒక భావానికి గురుతైయుంది. సువార్తికుని మనస్సులో ఉన్న రూప చిత్రాలకు మాట్లాడే మాటలు కేవలం గురుతుల పరంపరలే. ఇలా మాట్లాడే గురుతులు సువార్తికుని మనస్సులోనుండి శ్రోత యొక్క మనస్సులోనికి ఆ రూపచిత్రాన్ని తరలించడానికి చేసే ప్రయత్నమే (లేక ప్రయాసయే). అయినా యిది ఎప్పుడు సాధ్యమౌతుందంటే, సువార్తికుని యొక్క మాటల (గురుతుల) గ్రహింపును, శ్రోతయొక్క మాటల గ్రహింపును ఒక్కటే అయ్యినప్పుడే.

Batsell Barrett Baxter మాట్లాడేవాని భావాలు వినేవారి మనస్సుల్లోనికి రవాణా చేయడానికిగాను మాటలు వంతెనలుగా ఉంటాయ్ అని అంటాడు.[2] మాటలను శక్తివంతంగా ఎలా వినియోగించాలో నేర్చుకొనడం సువార్తికుని యొక్క నిజమైన పనియైయుంది. అతడు దీన్ని ఎలా చేయగలడు? సువార్తికునికి యిక్కడ మూడు చిన్న సలహాలు యివ్వబడుతున్నాయి.

మొదటిది, ఆయా ప్రజలకు ఆయా భావాలు వచ్చే పదాలను సువార్తికుడు తేటపరచ వలసియుంటాడు. ప్రత్యేకంగా మత సంబంధమైన పదాలను ఉపయోగించడంలో యిది ప్రాముఖ్యం. మాటలు మనమనస్సుల్లో దృశ్యాలను కల్పిస్తున్నందున, మనం మాట్లాడబోయే మాటలను మనం చిత్రీకరించుకొంటాం. సువార్తికుడు ఆ మాటలను యితరులతో మాట్లాడేటప్పుడు, అదే చిత్రం వారి మనస్సుల్లోనికి సహా వచ్చినప్పుడు మాత్రమే వారు ఆ వర్తమానాన్ని (సందేశాన్ని) పొందుతారు. సువార్తికుని యొక్క గ్రహింపుకు ఆ మాటలలో శ్రోతయొక్క గ్రహింపుకు వేరైనప్పుడు, అతడు ఆ వర్తమానాన్ని పొందడానికి బదులు, సువార్తికుని మాటలకు భావమేమని తాను అనుకొంటాడో ఆ రూపచిత్రాన్నే అతడు పొందుతాడు. ఉదాహరణకు, "బాప్తిస్మం" అనే మాటను ప్రతి ఒక్కరు ఒకే విధంగా గ్రహించరు. "బాప్తిస్మం"ని సువార్తికుడు ఉపయోగించినప్పుడు, తన మనస్సులో ఒక వ్యక్తిని నీటిలో ముంచి పైకి లేపినట్టి భావం కలిగియుండవచ్చు. శ్రోతకు, చిన్న బిడ్డ ముఖం మీద కొన్ని నీటి తుంపరలు చిలకరించడం అనే భావన ఉండియుండవచ్చు. ప్రసంగికుని మనస్సులో ఉన్న రూపచిత్రంకంటే బహు భిన్నమైన మరొక చిత్రం వినువాని మనస్సుకు తట్టియుండవచ్చు. "మారుమనస్సు," "విశ్వాసము," "సంఘం" అనే పదాలు తరచుగా వెవ్వేరు భావాలను కలిగించుతుంటాయి. అలాటి పదాల యొక్క సరియైన అర్థాన్ని వివరించడానికి మనం సమయాన్ని తప్పక తీసికోవాలి.

ఆఫ్రికాలో పాఠంలోని ఒక సత్యాన్ని ఉదహరించడానికి నేను కంచర గాడిదను సూచించాను, ఆ ఉదాహరణను శ్రోతల్లో ఎవరూ గ్రహించలేదని తరువాత తెలిసికొన్నాను. ఆఫ్రికాలోని ఆ భాగంలో కంచరగాడిదలు లేవు! ఆ పదం ఉపయోగించడంవలన శ్రోతలను తికమక చేయడమే జరిగింది. మరో సందర్భంలో, అహంభావం అనే పాపాన్ని గూర్చి సెకండరీ స్కూల్ క్లాస్‌లో నేను ఉపదేశించాను. "అహంభావం" అనే పదాన్ని వారు అర్థంచేసికోలేదని నాకు తట్టింది. "అహంభావం" అంటే అర్థమేమో వారికి తెలుసా అని నేను ఆ క్లాసును అడిగాను. ఆ గది వెనుక భాగంలో కుర్చున్న ఒక బాలుడు తన చేతిని ఎత్తాడు. మాట్లాడడానికి నేను అతనికి అనుమతి నిచ్చినప్పుడు, అతడు నిలిచి యిలా అన్నాడు, "అయ్యా, అది పెద్ద పక్షి." పెద్ద పక్షియై యుండడంలో పాపం అని నేనతని ఉపదేశిస్తున్నాను. ఆ పదం ఉపయోగించడంలో నా మనస్సులో ఉన్న చిత్రానికి బహు భిన్నమైన చిత్రం అతని మనస్సులో ఏర్పడింది. దీనంతటి భావమేమంటే, సమాచారాన్ని అందించడంలో మనం ఉపయోగించే మాటల విషయం జాగ్రత్తగా ఉండాలనేదే.

రెండవది, సువార్తికుడు సరళమైన ఎరుకైన మాటలను ఉపయోగించాలి. తాను మాటల పుట్టయైయున్నట్టు కనుపరచుకొనడానికి ప్రసంగించుట లేక ఉపదేశించుటకు చోటు కానేరదు. దేవుని కుమారుడుగా, ప్రభువైనయేసు సర్వశక్తి, సర్వ జ్ఞానముగలవాడైయున్నా, తన ఉపదేశములో ఆయన సాధారణమైన, జనులకు ఎరుకైన పదాలనే వినియోగించాడు.

మూడవది, వర్తమానాన్ని వ్యక్తిగతమైన అనుభవాలతో లేదా జనులకు ఎరుకైన కథలు స్థలాలు, సంఘటనలతో అతడు ఉదహరించుతూ ఉండాలి. చెప్పబడినదేదో దానికి యిది తేటైన మాటల చిత్రాలను తయారు చేస్తుంది.

నోటి వాక్కుల మూలంగా సమాచారాన్ని అందించడంలో సాధారణమైన రెండవ పరిమితి జ్ఞప్తి తెచ్చుకొనే లేక జ్ఞాపకపు మాటలు. విన్న దానిలో నూటికి అయిదు భాగాలు మాత్రమే ఒక సరాసరి వ్యక్తి జ్ఞాపకం చేసికోగలడని కొందరు పండితులంటారు. అట్టిది మనలను నిరాశపరచవచ్చు లేదా, మాటలతో సమాచారాన్ని అందించడం అనే కళలో ఎక్కువ నేర్పు పొందాలనే వాంఛను మనలో రేకెత్తించవచ్చు. ఎక్కువ పదాలు జ్ఞాపక ముంచు కొనడం కష్టం. ఒక దృశ్యంలో మనలను పెట్టే మాటలను లేక ఒక అనుభూతిని ప్రసాదించే వాటిని తేలికగా గుర్తు తెచ్చుకోవచ్చు. తన శ్రోతలను దృశ్యాల్లో నిలిపి, ఆ అనుభూతిలో వారు నివసిస్తున్నట్టు సహాయంచేస్తూ, ప్రభువైన యేసు తరచుగా ఉపమానాలతో మాట్లాడారు.

ఒక పాయింటు మీద ప్రసంగీకుడు మాట్లాడినదంతా జనులు జ్ఞాపకం ఉంచుకొనలేక పోగా, దాన్ని ఉదహరించడానికి అతడు ఉపయోగించిన కథను వారు జ్ఞాపకముంచు కొనగలరు. వారు ఆ కథను జ్ఞాపకముంచుకొన్నట్టయితే, వారు ఆ వర్తమానాన్ని జ్ఞాపకముంచు కొంటారు. నా యోచనను సవ్వాలు చేసే ఒక అనుభవాన్ని సువార్తికుడు చెప్పినట్లయితే, ఆ అనుభవాన్ని అనేక సార్లు జ్ఞప్తి తెచ్చుకుంటాను. వివరాలన్నింటితో నేను దాన్ని జ్ఞాపకం చేసికోలేకపోవచ్చు, కాని ఆయనుభవాన్ని తిరిగి జీవించడానికిని, మరియు తరువాత సంవత్సరాలలో నా సొంత వర్తింపులను చేసికొనడానికిని ఉంచుకుంటాను.

చంచలనాత్మకమైన అనుభవాన్ని, ఆనందదాయకమైన అనుభవాన్ని, కన్నీటితో కూడిన అనుభవాన్ని, లేదా భయానకమైన అనుభవాన్ని శ్రోతలు జ్ఞప్తి చేసికొంటారు. ఇవన్నీ ప్రసంగీకుని వర్తమానాన్ని బలపర్చుతూ, జ్ఞప్తి చేసికొనడానికి పనికివస్తాయి. తన శ్రోతలు జ్ఞాపకం చేసికొనేలా, అతని వర్తమానాన్ని తమ సొంత మాటలతో యితరులకు వర్తింప చేయగలిగి నట్లయితే, ప్రసంగించినవాడు బాగుగా జరిగించినవాడై యుంటాడు.

## మాటల యొక్క శక్తి

సమాచారాన్ని అందించడంలో మాటలే బహు బలమైన పరికరాలైయున్నాయ్. మాటలకున్న కొన్ని హద్దులను ఆలోచించిన మీదట కూడా, సమాచారాన్ని అందించడంలో అవే బలమైన సాధనములుగా నిలిచియున్నాయి. గనుక అవి మహత్తరమైన సామర్థ్యము కలిగి ఉన్నాయి. మాటలే వర్తమానానికి చేతులుగా, కాళ్లుగా, రెక్కలుగా మారగలవు. మాటలే వర్తమానానికి అద్దం, కిటికీ, పైప్‌లైన్‌గా ఉంటాయి. బైబిలు యొక్క వర్తమానం తరచుగా "వాక్యము"[3] అనబడుతుంది. తన మనస్సును ఉద్దేశాలను వ్రాయబడిన వాక్యంద్వారా[4] దేవుడు

మనకు బయలుపరచుకొన కోరుకున్నాడు.

మాటలు విశ్వాసాన్ని నిర్మించగలవు. తన సువార్త రచనలను వ్రాయడంలోగల ఉద్దేశాన్ని అపొస్తలుడైన యోహాను యిలా చెప్పుకున్నాడు, "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు" అని నమ్మాలట (యోహాను 20:30, 31).

మాటలు ఒప్పించగలవు. క్రీస్తు పునరుత్థానం తరువాత పేతురు తొలి ప్రసంగాన్ని చేసినప్పుడు, అతని శ్రోతలు "హృదయమందు పొడువబడినవారై" రక్షణ పొందడానికి తామేమి చేయవలెనో అడిగారు (అపొ. 2:37).

మాటలు హృదయపు స్వభావానికి తీర్పుతీర్చగలవు. "... దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు, హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నద"ని హెబ్రీ లేఖికుడు వర్ణించాడు (హెబ్రీ. 4:12).

మాటలను భద్రంగా చేపట్టాలి. అంతటి శక్తివంతమైన ఏ పనిముట్టయినా బహు జాగరూకతతో చేత పట్టవలసియుంటుంది. మాటలుకట్టగలవు లేదా నశింప జేయగలవు. నేను యువకుడనైయున్నప్పుడు ముసలివారి చాటవను నేను విన్నాను: "కర్రలు రాళ్లు నీ ఎముకలను విరువగలవు, కాని మాటలు నీకెన్నడు హాని చేయవు" అని అంటారు. సదుద్దేశాలతో ఆ సామెత ప్రయోగించబడేది గాని, అది సత్యం కాదు. మాటలు హాని చేయగలవు. కొన్ని సార్లయితే, పాపాన్ని ఒప్పించే సందర్భంలో లేదా తప్పును దిద్దే విషయంలో గాయపరచడం అవసరం. అప్పుడు కూడా, మనమాటలు "ఉప్పువేసినట్లు కృపాసహితముగాను" ఉండాలి (కొలస్సీ. 4:6).

## ముగింపు

సువార్తికులు, ఉపదేశకులు తమవైపో, లేక తమ మాట్లాడగల సామర్థ్యమువైపో ఆకర్షించడానికి మాటలను ఉపయోగించకూడదు, గాని క్రీస్తు సిలువవైపుకు ఆకర్షించాలి. వాస్తవంగా, వాక్చాతుర్యము లేనివాడైనందుకు పౌలు కొరింథీయులచేత విమర్శింపబడ్డాడు. తాను వాక్చాతుర్యముతోగాని, జ్ఞానాతిశయముతోగాని వారియొద్దకు రాలేదని భయముతోను ఎంతో వణకుతోను వారిమధ్యనున్నట్టు పౌలు చెప్పుకున్నాడు. తాను ఎంతటి జ్ఞానియో, లేక ఎంత ఒప్పింపగల సమర్థుడో ప్రదర్శించడానికి కాదని, పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనుపరచుచూ, సిలువవేయబడిన క్రీస్తును ఎత్తిపట్టడానికే తాను వచ్చియున్నట్టు అతడు తెలిపాడు. తన తోటి క్రైస్తవుల విశ్వాసము మనుష్యజ్ఞానం మీదగాక, దేవుని శక్తి మీదనే ఆధారపడి యుండాలని పౌలు కోరాడు (1 కొరింథీ. 2:1-5).

---

సూచనలు

[1]Batsell Barrett Baxter, *Speaking for the Master* (Grand Rapids, Mich.: Baker Book House, 1972), 115. [2]Ibid. [3]మార్కు 4:14; అపొ. 10:36; రోమా 10:8; 2 తిమోతి 4:2. [4]యోహాను 6:63; 2 తిమోతి 3:16, 17; 2 పేతురు 1:20, 21.